ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

బీరప్ప ఆలయంలో బీఆర్ఎస్ నేతల పూజలు

రాజాపేట, ఏప్రిల్ 23 : మండలంలోని దూదివెంకటాపురంలో ఇటీవల నిర్మించిన బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, మహిళ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నక్కిర్త కనకరాజు, సట్టు తిరుమలేశ్, రేగు సిద్దులు, రామిండ్ల నరేందర్, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, రాపోలు తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, డొంకెన మహేందర్ గౌడ్, కటకం స్వామి, ఎర్రగోకుల జశ్వంత్, ఉప్పలయ్యగౌడ్, మల్లారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు యత్నం
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులు పంపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డగూడూరు, ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. దళితబంధును కూడా ఆపి వారికి తీవ్ర అన్యాయం చేస్తుందని, వారిని కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబీమాను కూడా సక్రమంగా పంపిణీ చేయలేదని విమర్శించారు. ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీలను నెరవేర్చాలని కోరుతూ పోస్ట్‌కార్డులను సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈ నెల 25 సాయంత్రం 4 గంటలకు భువనగిరిలో జరిగే మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, నాయకులు శ్రీరాముల అయోధ్య, బాలెంల అరవింద్, గజ్జెల్లి రవి, గూడెపు పరమేశ్, కృష్ణ, నవీన్‌కుమార్, గూడెపు నరేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డికి శుభాకాంక్షలు

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ రాణీలక్ష్మణ్‌నాయక్

రాజాపేట, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన గొల్లపల్లి రాంరెడ్డిని మంగళవారం మండలంలోని పుట్టగూడెం గ్రామ మాజీ సర్పంచ్ మాడోతు రాణీలక్ష్మణ్‌నాయక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గుంటి మధసూదన్‌రెడ్డి, దేవీరాములునాయక్, ఎర్రగోకుల జశ్వంత్, గన్యానాయక్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

స్వామి కుమార్తెకు పోస్టల్ ఎఫ్‌డీ బుక్ అందిస్తున్న పోస్ట్‌మాస్టర్ అమర్‌నాథ్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి స్వామి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.71వేలను సేకరించి అందించారు. స్నేహితులు అందించిన డబ్బులను మృతుడి కుమార్తె సహజ పేరున సుకన్య సంవృద్ధియోజన పథకంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. దానికి సంబంధించిన పాస్ పుస్తకాన్ని పోస్ట్‌మాస్టర్ అమర్నాథ్ మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. దాతలకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని బతికించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్

బీబీనగర్, ఏప్రిల్ 23 : భారతదేశంలో ప్రజాస్వామ్యం, పౌర హక్కులు ఉండాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ ఓడిపోతేనే ప్రజలు అభివృద్ధి చెందుతారని.. ఆ పార్టీ గెలిస్తే అదాని, అంబాని లాంటి వారు బాగుపడతారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో హిందూ, ముస్లింల మధ్య విద్వేషం పెరిగేలా మాట్లాడారన్నారు. మోదీకి మన రాజ్యాంగం ఇష్టం లేదని, అందుకే మళ్లీ గెలిచి రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ఏ ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ ఉండదని చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో ప్రజల జీవితాలతో ఆడుకునే విధంగా.. ప్రజలపై భారాలు మోపే విధంగా ఉందని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె. వెంకటేశ్, కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు కందాడి దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్, బండారు శ్రీరాములు పాల్గొన్నారు.

గుట్టలో వైభవంగా తెప్పోత్సవం

విష్ణుపుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామివారు లక్ష్మీసమేతంగా తెప్పపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను దివ్యాభరణాలు, రంగురంగుల పుష్పమాలికలతో ముస్తాబు చేసి, ప్రధానార్చక బృందం, వేద పండితుల మంత్రోచ్చారణ, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల మధ్య కొండపైన గల విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. పుష్కరిణి వద్ద స్వామి, అమ్మవార్లను తూర్పు అభిముఖంగా వెంచేపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కరిణిలో తెప్పకు ఆవాహనం చేసి, గంగ జాలలకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసిన తెప్పపై వేంచేపు చేశారు. దేవస్థాన ప్రధానార్చకుల పర్యవేక్షణలో స్వామిని మేళతాళాల మధ్య తెప్పలో మూడుసార్లు జల విహారం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయ తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. స్వామివారు విహరించిన గంగజలాలను భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2,30,76,344

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి 28 రోజుల హుండీ ఆదాయాన్ని మంగళవారం కొండకింద వ్రత మండపంలో లెక్కించినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. రూ. 2,30,76,344 కోట్ల నగదు, మిశ్రమ బంగారం 147 గ్రాములు, మిశ్రమ వెండి 4 కిలోల 900 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. దాంతో పాటు 753 అమెరికా డాలర్లు, 45 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 230 యూఏఈ దిరామ్స్, 10 యూరోలు, 10 మలేషియా రింగిట్స్, 180 కెనడా డాలర్స్, 11 సింగపూర్ డాలర్స్‌తోపాటు భూటాన్, ఇండోనేషియా, శ్రీలంక, స్వీడన్ దేశాలకు చెందిన కరెన్సీలు వచ్చినట్లు చెప్పారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి : జడ్పీ సీఈఓ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

చౌటుప్పల్, ఏప్రిల్ 23 : ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని జడ్పీ సీఈఓ ఎన్.శోభారాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల ఈజీఎస్ సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. కూలీలకు రోజువారి కనీస వేతనం పడే విధంగా చూడాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీడీ సురేశ్, ఎంపీడీఓలు సందీప్‌కుమార్, కె.ప్రమోద్‌కుమార్, ఎంపీఓలు నర్సింహా రావు, జనార్దన్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 23 : వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి సూచించారు. మండలంలోని వాసాలమర్రి, కొండాపురం, వీరారెడ్డిపల్లి పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా పిల్లలను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆరుబయట ఆడుకునేందుకు అనుమతించాలన్నారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా చెరువులు, బావుల వద్దకు వెళ్లనీయవద్దని, బయటి ఆహార పదార్థాలు తినకుండా చూడాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం 10వ తరగతి చదివే విద్యార్థులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 40రోజుల ప్రత్యేక కార్యాచరణపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు, ఉమాదేవి, సత్యం, రమణి, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు లత, పద్మ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

జిబ్లక్‌పల్లిలో ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23 : భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఇటీవల మృతి చెందిన చిన్నలచ్చి ప్రశాంత్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో ప్రశాంత్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌కు నాలుగైదు రోజులుగా హాస్టల్లో రక్త విరోచనాలు అయినప్పుడు అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రశాంత్ మృతికి ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమని, అధికారులు, పోలీసులు మానవ హక్కులను ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని, జిల్లా కలెక్టర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. హాస్టల్ అధికారులను, సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే

చిన్నారుల తల్లిదండ్రులకు అసైన్మెంట్ కార్డును అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23 : పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ– 1 కేంద్రంలో మంగళవారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటపాటల ద్వారా అందించిన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలకు సంబంధించిన ప్రీ స్కూల్ అసైన్మెంట్ కార్డులను అందించారు. ప్రీ స్కూల్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్ జంగమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎం) ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎంపికైన ఆటో యూనియన్ సభ్యులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో లక్ష్మీనరసింహస్వామి ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదిరే దశరథ, ఉపాధ్యక్షుడిగా జోర్క శ్రీనివాస్, కార్యదర్శిగా దంతూరి జ్ఞానేశ్వర్, కోశాధికారిగా గడ్డం వీరస్వామి, సహాయ కార్యదర్శులుగా గట్టు శేఖర్, వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా మల్లేశ్, రవి, వెంకటేశ్ ఎన్నికయ్యారు.

వైభవంగా మహావీర్ రథోత్సవం

ఆలేరురూరల్, ఏప్రిల్ 23 : మండలంలోని కొలనుపాక జైనదేవాలయంలో మంగళవారం మహా పౌర్ణమి సందర్భంగా జైన సాంప్రదాయ రీతిలో మహావీరుని రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి తులసి తోట వరకు రథోత్సవం చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి జైన భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిషేధిత వస్తువులు విక్రయిస్తే జరిమానా

- మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23 : ప్రభుత్వం నిషేధించిన 16 రకాల వస్తువులను దుకాణాల్లో విక్రయిస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇయర్ బడ్స్, బెలూన్స్, క్యాండీ, ఐస్ క్రీమ్స్ కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ జెండాలు, కప్పులు, గ్లాసులు, ఫోర్క్ చెంచాలు, ఆహ్వాన పత్రాలు, సిగరెట్ ప్యాకెట్లు 100 మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, ప్లాస్టిక్ కవర్లు, అలంకరణ కోసం వాడే థర్మకోల్ వంటి వాటిని జూలై 2022 నుంచి ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించిన, విక్రయించిన వారికి రూ.500 నుంచి రూ. 5వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

పంపుసెట్ దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

- పోలీసులకు అప్పగింత

బోగారం గ్రామంలో గ్రామస్తులు పట్టుకున్న పంపుసెట్ దొంగలు

రామన్నపేట, ఏప్రిల్ 23 : మండలంలోని బోగారం గ్రామంలో మంగళవారం వ్యవసాయ బావిలోని పంపుసెట్‌ను దొంగిలిస్తున్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నలగొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన మహేశ్, మునుగోడు మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన గొలుసుల రాంబాబు, ఓర్సు శ్రీను బైక్‌పై వేములకొండకు వెళ్లి తిరిగి వస్తూ బోగారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామ శివారులోని గంపల రాంచంద్రారెడ్డికి చెందిన వ్యవసాయ బావిలోని పంప్‌సెట్‌ను దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే గేదెలను మేపుతున్న బొడ్డుపల్లి స్వామి గమనించి వారించాడు. దాంతో వారు అతడిపై దాడి చేసి బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. దాంతో స్వామి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న గ్రామస్తులకు ఫోన్‌లో సమాచారం అందించగా వారు రెండు కిలోమీటర్లు వెంబడించి నిందితులను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. రైతు రాంచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

సేవాదళ్ నకిరేకల్ ఇన్‌చార్జిగా రమేశ్

రామన్నపేట, ఏప్రిల్ 23: తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలకేంద్రానికి చెందిన మోటె రమేశ్‌ను నియమించారు. మంగళవారం రమేశ్‌కు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే వీరేశం, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

మోత్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బొమ్మలరామారం, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోరుతూ ఈ నెల 25న భువనగిరిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ షోలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలతో ప్రజలు ఇప్పటికీ పార్టీపట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు కుషంగల సత్యనారాయణ, గుదె బాలనర్సయ్య, కట్ట శ్రీకాంత్ గౌడ్, జూపల్లి భరత్, బండి మహేశ్ గౌడ్, పాండు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు తరలిరావాలి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వంద మందికి మించి తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మోత్కూరు : ఈ నెల 25న భువనగిరిలో జరిగే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ కోరారు. మంగళవారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకుబ్‌రెడ్డి, తీపిరెడ్డి మేఘారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, మాజీ ఎంపీటీసీలు జంగ శ్రీను, పి విష్ణు, మాజీ సర్పంచులు కడమంచి వస్తాద్, తిరుమలేశ్, నాయకులు శైలజ, అనిల్, సోంమల్లు, రఘపతి పాల్గొన్నారు.

ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

- చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

వలిగొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

వలిగొండ, ఏప్రిల్ 23 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు, పారామిలటరీ దళాలతో కలిసి రెడ్లరేపాక రోడ్డు నుంచి తొర్రూరు రోడ్డు అంబేద్కర్ చౌరస్తా వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగంచుకునే విధంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ మహేందర్‌లాల్, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

చౌటుప్పల్ : హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతిని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భువనగిరిలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రగతినగర్, హనుమాన్‌వాడ, నల్లగొండ చౌరస్తాల్లోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా హనుమాన్ జయంతి సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు బుస్స శ్రీనివాస్, కొణతం నాగార్జున్‌రెడ్డి, జక్క మోహన్‌రెడ్డి, సతీశ్, సోమనర్స య్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

తుర్కపల్లి, ఏప్రిల్ 23 : హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి చందనం పూసి సాముహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పొరెడ్డి పాపయ్య, ఎలుగల రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని భక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ఆలయ చైర్మన్ సందగళ్ల నాగరాజు గౌడ్ పాల్గొన్నారు

కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23 : మున్సిపల్ కార్మికులకు వేతనాలను ప్రభుత్వం సకాలంలో అందించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలల క్రితం మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే పెండింగ్ ఏరియర్స్‌ను మూడు నెలల్లో చెల్లిస్తామని చైర్మన్ హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. కార్మికులకు సబ్బులు, నూనె అందించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో సంఘం మండల కన్వీనర్ మంచాల మధు, రైతు సంఘం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, నాయకులు ప్రసాదం విష్ణు, వడ్డేపల్లి యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కోసం హెల్ప్‌లైన్

చౌటుప్పల్, ఏప్రిల్ 23 : వేసవి దృష్ట్యా తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేందుకు వీలుగా మున్సిపాలిటీలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బంది వస్తే హెల్ప్‌లైన్ నంబర్ 7799883937, 9963537625ను సంప్రదించాలని కోరారు.